క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వచ్చే నెల 17న సీజీఎం వార్షికోత్సవం




క్రిస్మస్ వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుదీప్, సత్యానందం, వీరబాబు

పెద్దాపురం: వచ్చే నెల 17వ తేదీన నిర్వహించే క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వార్షికోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో శుక్రవారం మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబులతో కలిసి క్రిస్మస్ వేడుకల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. 17వ తేదీన నిర్వహించే 12వ సీజీఎం వార్షికోత్సవాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బొందల త్రిమూర్తులు, పోలవరపు పైడిరాజు, అమదాల వీరబాబు సభ్యులు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఖో–ఖో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే ఇండోర్ స్టేడియంలో 15 రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖో–ఖో శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఖో–ఖో కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. డి.నందిని, జి.పావని, ఎస్.సుహాసిని, డి.సత్యలను తూర్పుగోదావరి నుంచి, ఆర్.సత్యవతి, ఆర్.తనుజ, కె.కళ్యాణి శ్రీకాకుళం, ఐ.భవాని, కె.పవిత్రలను నెల్లూరు నుంచి, ఆర్.యశోద, టి.సుస్మిత ప్రకాశం నుంచి, కె.లహరిని విశాఖ నుంచి, ఆర్.సత్యవతిని చిత్తూరు నుంచి, జి.అనితను కృష్ణా జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్టు నవంబరు 25 నుంచి 29 వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించే 43వ జాతీయ జూనియర్ నేషనల్ చాంపియన్ షిప్‌లో పాల్గొననుంది.

సినిమాలు



పెద్దాపురం	
లలితా స్క్రీన్–1	జీబ్రా
లలితా స్క్రీన్–2	అమరన్
వీరభద్ర	మెకానిక్ రాకీ
శోభా	దేవకీనందన వాసుదేవ
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్–1	దేవకీనందన వాసుదేవ
అనుశ్రీ స్క్రీన్–2	అమరన్
విఘ్నేశ్వర	మెకానిక్ రాకీ
పిఠాపురం	
వెంకటేశ్వర థియేటర్	దేవకీనందన వాసుదేవ
సత్య	జీబ్రాన్
అన్నపూర్ణ	అమరన్
పూర్ణ	మెకానిక్ రాకీ
ఉప్పాడ	
శ్రీనివాస థియేటర్	అమరన్

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ–1	85558 71069
ఎంఈఓ–2	94410 73418

వ్యాధులకు డ్రై వాష్

- రోగాల వ్యాప్తికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది
- గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

పిఠాపురం: వాతావరణం మారింది. పగలు ఎండ, రాత్రి చలి తీవ్రంగా ఉంటోంది. చలికాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశాలు ఎక్కువ. వ్యాధులు వచ్చాక వైద్యం చేయడం కంటే, ముందుగానే వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేసేందుకు వైద్యారోగ్య శాఖ ఆదేశాలతో అధికార యంత్రాంగం వాష్ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యాధులు ఎక్కడ, ఎలా విజృంభించే అవకాశాలు ఉన్నాయి, వాటిని ఎలా నివారించాలనే విషయంపై దృష్టి సారించారు. ముఖ్యంగా క్రిమికీటకాదులు పెరిగి వ్యాధులకు కారణమయ్యే అవకాశాలను గుర్తించి, వాటిని ఆదిలోనే నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టారు.

వాష్ ప్రోగ్రాం తీరిది..

నీరు, గాలి, ఈగలు, మట్టి మలినాలు, అపరిశుభ్రత, చేతులు శుభ్రం చేయకపోవడం వంటి వాటి వల్ల వ్యాధులు విజృంభించే అవకాశాలు ఉన్న విషయాన్ని వివరించడమే వాష్ ప్రోగ్రాం లక్ష్యం. గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయడం, వెక్టార్ బోర్న్ డిసీజెస్ డెంగీ, మలేరియా వంటి వ్యాధులు కలుగజేసే దోమల నివారణకు చర్యలు తీసుకోవడం. శానిటేషన్, తాగునీరు, శుభ్రతపై ప్రజల్లో అవగాహన కలిగించడం, అంటు రోగాలకు కారణమయ్యే కుళ్లిన, నిల్వ ఉన్న ఆహారాలు తినకుండా ప్రజలను



గొల్లప్రోలులో ఇళ్ల మధ్యన అపరిశుభ్రతపై జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య సిబ్బంది

అప్రమత్తం చేయడం. చేతులను శుభ్రం చేసుకునే విధానాలను ప్రజలకు వివరించడం వంటి చర్యలు తీసుకోవడం ఇందులో ఉన్నాయి. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి దోమలు గుడ్లు పెట్టే అవకాశాలున్న పరిసరాలను గుర్తించి, దోమలు ఉత్పత్తి కాకుండా తీసుకోవాల్సిన చర్యలు ప్రజలకు వివరించడం. దోమలను గుడ్ల దశలోనే నివారించడానికి ప్రతి ఇంటి వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవడం. ప్రజలకు సూచనలు ఇవ్వడంతో పాటు, ఎవరైనా వ్యాధుల బారిన పడితే వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి, తక్షణ చికిత్స అందించడం వంటి చర్యలు వేగవంతంగా తీసుకుంటారు.

ఫ్రైడే డ్రైడే

శుక్రవారం నాడు డ్రై డేగా ప్రకటించిన వైద్యారోగ్య



గొల్లప్రోలులో ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండే సామాన్లను గుర్తిస్తున్న వైద్య సిబ్బంది

శాఖాధికారులు గ్రామాల బాట పడుతున్నారు. గ్రామాల్లో బృందాలుగా వెళ్లి, అన్ని గృహాలు సందర్శించి ఇళ్ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. ఇళ్ల వద్ద దోమలు నిల్వ ఉండే పరిసరాలు, గోతులు, ఖాళీ డబ్బాలు, డ్రైన్లు వంటి వాటిని పరిశీలించి, దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేయిస్తున్నారు. ముఖ్యంగా బురద, నీరు నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో అన్ని మురికి కాలువల్లోను దోమల వ్యాప్తి నివారణకు మందులు పిచికారీ చేస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి ఇళ్లల్లో కుటుంబ సభ్యులందరినీ పరిశీలించి, వ్యాధులున్న వారికి తక్షణ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో..

గొల్లప్రోలు మండలంలోని గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులను కట్టడి చేయగలుగుతున్నాం. ఎక్కడ దోమలు వ్యాప్తి చెందుతాయో గుర్తించి, వాటి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలో ప్రతిరోజు 30 కుటుంబాలను సందర్శించి, ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకున్నాం. మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, స్వైన్ ఫ్లూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, నీళ్ల విరేచనాలు, కలరా, పచ్చ కామెర్లు వంటి వ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయో ప్రజలకు వివరిస్తున్నాం. ముఖ్యంగా రోడ్డు పక్కన అమ్మే పానీపూరీ, కుళ్లిన చేపలు, నిల్వ ఉన్న మాంసాహారం, కుళ్లిన పండ్లు వంటి వాటిని తిన్నా, ఇళ్ల వద్ద పారేసినా ఈగలు, దోమలతో వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తున్నాం.

– అహ్మద్ బాషా, హెల్త్ సూపర్‌వైజర్, గొల్లప్రోలు

అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పండితుడు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, పూలమాలలతో అలంకరించారు. అలాగే 18 పడి మెట్లను అలంకరించి, ఆలయ అర్చకుడు మణిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు



పోటీలకు సిద్ధం చేసిన కోర్టు

పిఠాపురం: పట్నాల అన్నేశ్వరరావు (సౌత్ సెంట్రల్ రైల్వే) రావుల వరహాలు (పోలీస్) మెమోరియల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం నుంచి పిఠాపురంలో ప్రారంభం కానున్నాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు శుక్రవారం ఈ విషయం తెలిపారు. పిఠాపురం పాత బస్టాండ్ మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో శని, ఆదివారాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

కారును ఢీకొన్న బస్సు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

సామర్లకోట: కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం కారు, బస్సు ఢీకొన్నాయి. సామర్లకోట నుంచి కాకినాడ వైపు వస్తున్న కారు రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ నాన్‌స్టాప్ బస్సును ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జయ్యింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ముత్యాలమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారి పనులు జరగడంతో రోడ్డుపై మట్టి ఉండటంతో రోడ్డు ఇరుకుగా మారింది. బస్సు వేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వీకే రాయపురం మాజీ సర్పంచ్ కుర్రా రాజు ఆరోపించారు. ఈ ప్రమాదంతో ఏర్పడిన ట్రాఫిక్ అంతరాయాన్ని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బందితో కలసి సరి చేశారు. భారీ వాహనాలను అచ్చంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించారు. కారును సమీపంలో ఉన్న పొలంలోకి జరిపించి క్రమబద్ధీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన కారు

సర్వపాప హరణం శివయ్య దర్శనం

- అభిషేకాలు తిలకించడానికి బారులు తీరిన భక్తులు
- పంచారామ క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ

సామర్లకోట: స్థానిక బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. భక్తులు తీసుకు వచ్చిన పాలతో ఒకసారి మాత్రమే అభిషేకం చేస్తారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పోటీ పడడంతో ఆలయంలో రద్దీ ఏర్పడింది. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తెల్లవారు జామున 4 గంటలకు ఆలయం తెరచిన తరువాత గోపూజ చేసి స్వామి వారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ప్రముఖులు వచ్చే సమయంలో అభిషేక ప్రియుడైన శివయ్యకు ఆలయ పండితులు, అర్చకులు జలాభిషేకాలు చేస్తూ ఉంటారు. స్వామి వారికి పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగిన తరువాత అభిషేకాలు నిలిపివేస్తారు. దీపాలంకరణలకు, దీపదానాలకు పెట్టింది పేరైన ఈ నెలలో కాలభైరవస్వామి ఆలయం, ధ్వజస్తంభం, రావి, జమ్మి, మారేడు, తులసి మొక్క వద్ద, ఉప ఆలయాల వద్ద దీపాలను వెలిగించారు. ఆలయ పండితులు శ్రీచక్ర పండితులు వేమూరి సోమేశ్వశర్మ, అభిషేక పండితులు అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, ఆలయ అర్చకులు శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు అంజిబాబు, భాస్కర్ పూజలు నిర్వహించారు. ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



పంచారామ క్షేత్రంలో స్వామి వారిని అభిషేకిస్తున్న అర్చకులు

డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ దీపారాధన సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 10 వేల మందికి అన్నదానం, సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించనున్నారు. రెండో తేదీన భక్త సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి వెండి జటాజూటం అలంకరణతో కార్తిక మాసోత్సవాలు ముగియనున్నాయి.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు

స్థానిక పంచారామ క్షేత్రాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన, ఉప ఆలయాల్లో పూజల అనంతరం పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఈఓ స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.



ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

స్వామి వారికి లక్ష బిల్వార్చన

ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద ఈఓ ఆధ్వర్యంలో ఆకాశదీపం వెలిగించి పూజల అనంతరం శిఖర భాగంలో ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగాలు

ఈ సందర్భంగా లక్షపత్రి పూజలు చేసుకున్న వారు శుక్రవారం ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగాలు ఆకట్టుకున్నాయి.

శాంతిభద్రతలపై పటిష్ట పర్యవేక్షణ

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ అధికారులు, సిబ్బంది కట్టుబడి ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అధ్యక్షతన నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో మహిళలు, చిన్నారుల భద్రత, డిజిటల్ అరెస్టు, రౌడీషీటర్లపై నిఘా, గంజాయి నియంత్రణ, ఎఫ్ఐఆర్‌ల నమోదుపై జాప్యం, ఆర్థిక నేరాలు, మహిళా రక్షక్‌ల సేవలు, సైబర్ నేరాల నియంత్రణ, ఫిర్యాదుదారులతో స్టేషన్ అధికారులు, సిబ్బంది మర్యాదకరంగా నడుచుకోవడం అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగతనాల్లో సొత్తు రికవరీ చేసిన సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, క్రైం సీఐ అంకబాబులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేశారు. వారి సిబ్బందిని అభినందించారు. అలాగే అత్యధిక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినందుకు కోరంగి ఎస్ఐ సత్యనారాయణకు ఎస్పీ ప్రశంసా పత్రమిచ్చి అభినందించారు.



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కుక్కుటేశ్వరునికి లక్ష పత్రి పూజలు

- పాదగయ క్షేత్రంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

పిఠాపురం: కార్తిక మాసం సందర్భంగా పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. కాకినాడ జిల్లాతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. ప్రముఖ శైవ క్షేత్రమైన స్థానిక పాదగయ పుణ్యక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి వారికి ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్వామి వారికి పంచామృతాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి లక్షపత్రి పూజలు, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. అభిషేకాల అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాదగయ పుష్కరిణిలో పలువురు భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, కార్తిక దీపాలు వదిలారు. బ్రాహ్మణులకు కార్తిక దీపాలను దానాలు చేశారు. కార్తిక మాసం మొదలైన నాటి నుంచి స్వామి వారి ఆలయాన్ని రోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శిస్తుంటారు. ఈ ఏడాది కార్తిక మాసం ప్రారంభం నాటి నుంచి పిఠాపురం, పరిసర ప్రాంతాల నుంచే కాకుండా, సుదూర ప్రాంతాల వారు సైతం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలోని దత్తాత్రేయ కల్యాణ మండపంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకుంటున్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో, దేవదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, కుంకుమ పూజలు చేశారు. పట్టణంలో సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి తదితర ఆలయాల్లోను అధికారులు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. పిఠాపురం మండలం భోగాపురం, పి.దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు.



కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి వారు

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

గ్రామ సచివాలయం	సెల్ నంబర్
కొత్తపల్లి	
ఉప్పాడ–1	9951422177
ఉప్పాడ–2	6304179606
ఉప్పాడ–3	6976476445
ఉప్పాడ–4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి–1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం–1	9492834413
కొండెవరం–2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి–1,2	9493288248
అమీనాబాద్–1	8555818794
అమీనాబాద్–2	8332006890
యండపల్లి–1	9949563505
యండపల్లి–2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ–1	9704397769
పొన్నాడ–2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల స్వాధీనంలో ఉన్న భూ సమస్యను పరిష్కరించడానికి రీ సర్వే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖర రెడ్డి అన్నారు. మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో ఇందిరాగాంధీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే అవగాహన సదస్సు కు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దస్తావేజులో, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరి పేరున రికార్డు అయితే సర్వే చేసి పరిష్కరిస్తామన్నారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు మండల పరిధిలో 16 గ్రామాల్లో రీ సర్వే గ్రామ సభలు పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామ సభల్లో సాయంత్రం వరకు 98 అర్జీలు వచ్చాయని, సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని 10, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం 6, భూమి విస్తీర్ణం తగ్గిందని 60, ఆధార్ నెంబరు మార్చాలని 12, భూమి స్వభావం మార్చాలని మూడు, సర్వే నెంబరు తప్పుగా పడిందని ఏడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు టి.సాయిరాం, ఎ.సంజీవ్, డి.దినేష్, బి.రామకృష్ణ, రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

మహారాణి ఆశయ సాధనకు కృషి చేయాలి

పెద్దాపురం: రాజా వత్సవాయి బుచ్చి సీతాయ్యమ్మ జగపతి బహదూర్ మహారాణి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహారాణి సత్రం ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అన్నారు. మహారాణి 189వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ మహారాణి ఆశయాలను తూచా తప్పకుండా సత్రంలో పాటించడం అభినందనీయమన్నారు. 1882లో స్థాపించిన సత్రం దినదినాభివృద్ధి చెంది బాటసారులకు, విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. సత్రానికి వెన్నెముకలా ఉన్న కౌలు రైతులు ఎన్ని ఇబ్బందులున్నా పేదలకు అన్నదానం చేసేందుకు వీలుగా సకాలంలో శిస్తు చెల్లించి ఆసరాగా నిలుస్తున్నారన్నారు. 13 జిల్లాల్లో ఎక్కడా అమలు చేయని విధంగా 365 రోజులూ రెండు పూటల భోజన వసతి కల్పిస్తున్న సత్రం ఇదేనన్నారు. తొలుత మహారాణి విగ్రహానికి వారు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు వస్త్రదానం చేస్తున్న ఈఓ, సిబ్బంది

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి, వడిశెట్టి నారాయణ రెడ్డి తెలిపారు. శివాలయం సెంటర్ వద్ద ఉదయం నుంచి వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.